ప్రజాశక్తి

బుధవారం 17 జులై 2024 5 విజయనగరం



భారీ వర్షం..రైతుల హర్షం

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన ర్షంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. వర్షంతో ఖరీఫ్ పనులు ముమ్మరం అయ్యే అవకాశం ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసిన వరినారు ఎండిపోతున్న దశలో వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.



గజపతినగరంలో కురుస్తున్న వర్షం

మొరాయిస్తున్న మిషన్లు

- సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు లేబొరేటరీలు
- వైద్యసేవలకు నోచుకోలేకపోతున్న పేదలు
- ఇదీ సర్వజన ఆస్పత్రిలో దుస్థితి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని సర్వజనాసుపత్రిలో తరచూ రోగులకు పరీక్షలు చేసే మిషన్లు మొరాయించడంతో రోగులకు సరిగా వైద్య సేవలు అందడం లేదు. థైరాయిడ్ పరీక్షలు చేసే మిషన్ పాడై పది రోజులు కావస్తున్నా దాని గురించి పట్టించుకునే నాథులు లేరు. తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అన్నట్టుగా మిషన్ బాగుచేసేందుకు కంప్లైంట్ పెట్టి ఊరుకున్నారట. దీంతో, సగటు థైరాయిండ్ రోగులు తల్లడిల్లిపోతున్నాయి. మొన్నటి వరకు ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ పనిచేయకపోవడంతో అత్యవస సేవలకు అంతరాయం కలిగింది. దీంతో వైద్యసేవలు అందుకోలేక రోగులు సతమత మౌతున్నారు. నాటి జిల్లా కేంద్రాసుపత్రి, ఘోషాసుపత్రులను ఏడాది ఏడాదిన్నర క్రితమే మెడికల్ కాలేజీకి అప్పగించిన సంగతి తెలిసిందే. దీంతో, పేరు కూడా సర్వ జన ఆసుపత్రిగా మార్పుచేశారు. తద్వారా వైద్య ప్రమాణాలు పెరుగుతాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. జనం కూడా అంతే ఆశతో ఆసుపత్రికి వస్తున్నారు. గతంలో రోజూ 500 నుంచి 700 వందలు వరకు ఒపి నమోదయ్యేది. పడకలు కూడా పరిమితంగా ఉండేవి. మెడికల్ కాలేజీ పరిధిలోకి వెళ్లడంతో మహారాజ, ఘోషాసుపత్రిలో ప్రస్తుతం మొత్తంగా 605 పడకలు ఉన్నాయి. రోజూ సరాసరిగా 1000 నుంచి 1200 వరకు ఓపి ఉంటోంది. సోమవారం అయితే ఒపి సేవలు 1700పైమాటే. వడకలూ ఖాళీ ఉండడం లేదు. వీరంలో సగానికి సగం మంది రోగులను వైద్యపరీక్షలకు సిఫార్సు చేస్తున్నారు. దీంతో, లేబొరేటరీ వద్ద రిజిస్ట్రేషన్, శాంపిల్స్ సేకరణ వద్ద అనుక్షణం వందల కొద్దీ రోగులు బారులు తీరుతున్నారు. గంటల కొద్దీ నిలబడి ఉండడంతో రోజూ ఇద్దరో ముగ్గురో సొమ్మ సిల్లిపోతున్న సందర్భాలూ ఉంటున్నాయి. ఇక కౌంటర్లు, లేబొరేటరీలో సిబ్బంది పరిమితంగా ఉండడంతో ఎప్పటికప్పుడు రిపోర్టులు కూడా ఇవ్వలేని దుస్థితి దాపురించింది. రిపోర్టులు వచ్చేలోపు ఓపిలోని వైద్యులు డ్యూటీ దిగిపోవడంతో రిపోర్టులు ఎవరికి చూపించాలో తెలియని పరిస్థితి. వాటిని చూపించడానికి తిరిగి మరుచటిరోజు రావాల్సి వస్తోంది. చొవర చేసి ప్రశ్నించిన రోగులకు రౌండ్స్‌లోవున్న వైద్యులకు చూపించుకోమని ఆసుపత్రి సిబ్బంది సెలవిస్తున్నారు. అంతపెద్ద ఆసుపత్రిలో వైద్యులను వెతికి పట్టుకునే ఓపికలేక రోగులు నిరాశ, నిశత్తువతో వెనుదిరగాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఈ సంగతి కాస్త అటుంచితే.... మానవ శరీర వ్యవస్థలోని ముఖ్యమైన వాటిలో థైరాయిడ్ ఒకటి. ఇది హెచ్చుతగ్గులు అయినప్పుడు తీవ్ర అనారోగ్యానికి గురికావాల్సిన పరిస్థితి వస్తుంది. ఇటీవల కాలంలో ఈ సమస్యతో బాధపడుతున్న రోగుల సంఖ్య ఎక్కువగా ఉందని సాక్షాత్తు వైద్యులే చెబుతున్నారు. ఇంతటి కీలకమైన థైరాయిడ్ సమస్యకు సర్వజన ఆసుపత్రిలో పరీక్షలు అందుబాటులో లేవంటి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పదిరోజుల క్రితమే దీనికి సంబంధించిన మిషన్ మరమ్మతులకు గురైనప్పటికీ అధికారులు దీన్ని బాగుచేయించేందుకు చొరవ తీసుకోలేదు. దీంతో, కాస్త ఆర్థికంగా అవకాశం ఉన్నవారు ఆసుపత్రి ఎదురుగానేవున్న ప్రైవేటు లేబొరేటరీలో రూ.500 చెల్లించి పరీక్ష చేయించుకుంటున్నారు. అంత స్థోమత లేనివారు నిరాశతో తిరిగి వైద్యులను సంప్రదించ కుండానే ఇంటిముఖం పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో థైరాయిండ్ పరీక్ష కిట్లు లేక సేవలు అందించని సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు లేబొరేటరీలకు లాభం చేకూర్చేందుకే ఒక్కోసారి ఇటువంటి కుంటిసాకులు చెబుతున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రోగులు కోరుతున్నారు.

గిరిశిఖర ప్రాంత అభివృద్ధికి కృషి

- రామభద్రపురం మండలాన్ని ఐటిడిఎలో చేర్చేందుకు కేంద్రానికి లేఖ రాస్తా
- చిన్నారి కుటుంబానికి ఎంపి కలిశెట్టి పరామర్శ
- ఏడొంపుల గెడ్డ, గ్రీన్‌ఫీల్డు రహదారి పరిశీలన



జీలుగువలసలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-రామభద్రపురం

గిరి శిఖర ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. రామభద్రపురం మండలాన్ని ఐటిడిఎలో కలిపేందుకు కేంద్రానికి లేఖరాస్తానని చెప్పారు. జీలుగువలసలో లైంగిక దాడికి గురైన చిన్నారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి బాలిక పరిస్థితిని తెలుసుకున్నారు. ఎంపి కొండ కెంగువ వరకు కారులో వచ్చి అక్కడి నుంచి కొంతదూరం ద్విచక్ర వాహనంపై పయనించి ఆ తరువాత రహదారి అనుకూలంగా లేకపోవడంతో సుమారు 2 కిలోమీటర్ల కాలి నడకన సెలయేర్లు దాటుకుంటూ గిరి శిఖర గ్రామం జీలుగు వలస చేరుకున్నారు. చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో పూరి పాకలో నడుపుతున్న మినీ ఆంగన్ వాడీ సెంటర్లో ఆయా బుచ్చమ్మతో మాట్లాడి చిన్నారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ రహదారులు అధ్వానంగా ఉన్నాయని కనీస సౌకర్యాలు కరువవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని సమస్యలు ఏకరువు పెట్టారు. ఈ గ్రామం నుంచి 3 కిలోమీటర్ల ఆవల ఉన్న పాఠశాలకు నడక దారిలో హైవే దాటి విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందని తెలపడంతో స్వయంగా ఆ మార్గంలో నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. చిన్నారులు ఈ మార్గం మీదుగా వెళ్ళడం అసాధ్యమని, విద్యార్థులను ఇదే పంచాయతీ పాఠశాలలో చేర్పించేలా ఎంఇఒ చర్యలు తీసుకోవాలని సూచించారు. మిని అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఊరంతా తాటాకు ఇళ్లే ఎక్కువగా ఉండడంతో పక్కా ఇళ్లు మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణాలు పరిశీలించారు. ఆ సంస్థ అధికారి రవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంస్థ తరపున గ్రామాల్లో అభివృద్ధికి సహకరించాలని కోరారు. కొండ కెంగువలో దేవునిబాబు ఆశ్రమాన్ని సందర్శించి కొద్ది సేపు ధ్యానం చేశారు. అక్కడే ఉన్న ఏడొంపుల గెడ్డ ఆనకట్టను పరిశీలించి సాగునీరు అందే గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్నారిపై జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తామన్నారు. పసికందు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం అంగన్వాడీ కార్యకర్త పర్యవేక్షణ చేయాలని కోరినట్లు చెప్పారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన వలన గ్రామాలు కూడా కలుషితమయ్యాయని అన్నారు. ఆడపిల్లలపై అకత్యాలు జరగకుండా అంగన్వాడీలు, మహిళా ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కర్, స్థానిక సర్పంచ్ కంచుపల్లి సుజాత, కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సిరిపురం శ్రీనివాసరావు, ఆరికతోట నాయకులు పల్లా చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా రూపొందించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం

పిల్లలు, యువతలో డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడం ద్వారా జిల్లాను డ్రగ్స్, మత్తుపదార్థాల రహితంగా రూపొందించే దిశగా అధికారులంతా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. పిల్లల్లో డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో సంయుక్త కార్యాచారణ రూపొందించేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యులు గొండు సీతారాం, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, జిల్లా అధికారులు పాల్గొని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా డ్రగ్స్ నియంత్రణకు జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ పిల్లల వ్యవహారశైలి, నడవడికను ఇంటివద్ద వారి తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరంతరం గమనిస్తూ వుండాలని, వారు అసాధారణంగా వ్యవహరించినట్లయితే వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు గమనిస్తే వెంటనే అప్రమత్తం కావాలని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం అధికంగా వుంటోందని, ఇక్కడ హాస్టళ్లలో వుంటున్న విద్యార్థులు, యువతపై నిఘా వుంచాలని అన్నారు. డ్రగ్స్‌కు బదులుగా మత్తు ఇచ్చే ఔషధాలను మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్టు తెలుస్తోందని అటువంటి ఔషధాలు డాక్టర్ల సిఫారసు లేకుండా విక్రయించకుండా చూడాలని డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు సూచించారు.

పిల్లల్లో మార్పు తీసుకురాగలిగే శక్తి ఉపాధ్యాయులకే వుంటుందని అందువల్ల వారు పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేలా కృషి చేయాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆరోగ్యకరమైన యువతీయువకులు వుంటేనే ఆరోగ్యకరమైన సమాజం రూపొందుతుందని జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం అధ్యక్షులు హిమబిందు అన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ సుమబాల, పోలీసు, ఎక్సైజ్, విద్యా, వైద్యశాఖల అధికారులు, డిఆర్‌డిఎ, మెప్మా,పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతి చిన్న అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సెట్విస్ సిఇఒ బి.రామ్ గోపాల్, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. అరుణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంగోపాల్, అరుణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నైపుణ్య శిక్షణలు వినియోగించుకొని తద్వారా చిన్న పెద్ద ఉపాధి అని ఆలోచించకుండా ఉపాధి పొందాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వడమే కాకుండా ఇండస్ట్రీలలో చదువుతున్న సమయంలోనే అదనపు నైపుణ్యం పెంపొందడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోగలరు కార్యక్రమంలో నైపుణ్య శిక్షణలో పొందిన యువతి యువకులకు ధవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ నీలం గోవిందరావు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి సుధారాణి, జిల్లా పరిశ్రమల ఐపిఒ కె.వర్ధన్, జిల్లా సీడాప్ ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరరావు, ఐటిఐ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న నైపుణ్య అభివృద్ధి అధికారి, ప్రిన్సిపల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

భీమసింగి చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరవాలి

- మంత్రి కొండపల్లి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీపై చిన్నతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరవాలని, తెరిచే వరకు పోరాడతామని తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విదేశాల నుంచి తక్కువ ధరకు పంచదార దిగుమతి కావడంవల్ల చక్కెర కర్మాగారం నష్టాలకు కారణమని చెప్పడం సరికాదన్నారు. దీనిపై వేలాది మంది కార్మికులు, 6వేల మంది రైతులు ఆధారపడి ఉన్నారన్నారు. 2020లో ఆధునీకరణకు రూ.20కోట్లు ఖర్చు పెడితే బాగా తయారయ్యే పరిశ్రమ అని అప్పటిమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారని గుర్తు చేశారు. కానీ నిధులు కేటాయించకుండా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పి బలహీన పరుస్తున్నారన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రత్యామ్నాయం చూస్తామని చెబుతున్నారని, ఏమి చూస్తారో చెప్పాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, కొత్త వంగడాలు కోసం ప్రయత్నం లేదని, ఏమి ప్రత్యామ్నాయం చూస్తారని ప్రశ్నించారు. పరిశ్రమను మూసేసి ఆ భూములను కాజేయాలని పాలకులు చూస్తున్నారని తమ్మినేని అన్నారు. మంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, తక్షణమే పరిశ్రమను తెరవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు

ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి : డివిజి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉపాధ్యాయుల్ని రాష్ట్రాల వారీగా నియమించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు లేఖరాశారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఎన్ఇఎస్‌టి సంస్థ ద్వారా దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను నియమించడం ద్వారా వారు ఇక్కడ పనిచేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో నియమించిన హిందీ ఉపాధ్యాయులు హిందీ భాషలో పాఠాలు చెప్పడం వలన పిల్లలకు అర్థం కాక ఆందోళనకు గురవుతు న్నారని తెలిపారు. కేంద్రీకృత పద్ధతిలో కాకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలో గల ఉపాధ్యాయులను నియమించాలని సిఫార్సు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.



చంపావతి నదిలో నీటి పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు

రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రోజు విడిచి రోజు నీటి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. మంగళవారం నెల్లిమర్ల హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించి అక్కడ నీటి సామర్థ్యం, స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రస్తుతం నీటి పంపిణీకి అవసరమైన అదనపు నీటిని ఆంధ్ర నుండి రప్పించేందుకు జిల్లా కలెక్టర్‌కు ఆంధ్ర నుండి మూడు నాలుగు రోజుల్లో అదనపు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి పంపిణీకి అవసరమైన 16 ఎంఎల్‌డి. నీరు అందుబాటులో ఉందని, అదనపు నీరు అందుబాటులోకి వస్తే రానున్న 15 రోజుల తర్వాత కూడా యథా ప్రకారం రోజు విడిచి రోజు సకాలంలో నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఆయన వెంట ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి

కాలువల్లో పేరుకుపోయిన పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలో కాలువలలో పూడిక చేరి ఇబ్బందికరంగా మారిందన్న ఫిర్యాదు మేరకు ఇంజనీరింగ్, ప్రజారోగ్య సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. కాలువలో పేరుకు పోయిన చెత్తాచెదారాలను తక్షణం తొలగించాలని సిబ్బందికి సూచించారు. కాలువల్లో చెత్తలు వేసినట్లు గమనిస్తే అపరాధ రుసుమును వసూలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను మరింత మెరుగు పర్చాలని, అదనపు సౌకర్యాలు కల్పించాలని ఆసుపత్రి అభివద్ధి కమిటీ నిర్ణయించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిజిహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా సర్వజన ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రుల్లోని సమస్యలు, అభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలను, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కమిటీ ముందు ఉంచారు. వీటిపై చర్చించి, ఆసుపత్రి అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇటీవల మరమ్మతుకు గురైన ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ సిద్ధమై రోగులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి కొత్తగా రెండు మరుగుదొడ్ల సముదాయాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు, వార్డు సచివాలయాల నుంచి ఐదుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై తక్షణమే పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అదనంగా 6 కెవి ఆక్సిజన్ ట్యాంకును ఏర్పాటు చేస్తామన్నారు. ఘోషాసుపత్రిలో ఎంపి నిధులు రూ.31లక్షలతో కొత్తగా భారీ లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.దాదాపు రూ.80లక్షలతో సర్వజన ఆసుపత్రి మరమ్మ తుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిజిహెచ్‌ను మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా పేరు మార్చేందుకు, ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ పివిజిరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సభ్యులు ప్రతిపాదించ గా, ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ, ఘోషాలో లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.సుమబాల, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పల నాయుడు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీ శంకర్, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కమిషనర్ ఎంఎం నాయుడు, కమిటీ సభ్యులు డాక్టర్ విఎస్ ప్రసాద్ తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల నిర్వహణకు విరాళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేదల ఆకలి తీర్చేందుకు ఆగస్టు 15 నుంచి పునఃప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్షా 30వేల విరాళాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు విజయనగరం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మంగళవారం అందజేశారు. తిలక్ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర ప్రసాద్ లక్ష రూపాయలను, కందాల సాయిబాబా, హైమావతి దంపతులు రూ.30వేలను సమకూర్చగా, ఎంఎల్ఏ చేతులమీదుగా కలెక్టర్ ఛాంబర్‌లో చెక్కులను అందజేశారు.

1912కు ఫోన్ చేయండి.. వ్యవసాయ కనెక్షన్ పొందండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన వారంతా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి, సర్వీసు పొందవ చ్చని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ప్రజాశక్తి తో ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కాల్ సెంటర్ 1912కు ఫోన్ చేయడం ద్వారా పొందవచ్చునన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసేటప్పుడు రైతులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను దృష్టిలో పెట్టుకొని రైతులు నేరుగా కాల్ సెంటర్ నంబర్ 1912కు ఫోన్ చేస్తే కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ను పొందే నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికేట్ నంబర్, కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ విని యోగదారులకు వర్తిస్తుంది) వంటి వివరాలను తెలియచేయాలని తెలిపారు.

జిపిఎస్ గెజిట్ రద్దుపట్ల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవడం పట్ల ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఎజిఎస్ గణపతిరావు, ప్రధానకార్యదర్శి కె.ప్రకాష్‌రావు హర్షం వ్యక్తం చేశారు.నిజమైన ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమంటే ఇలా ఉండాలని పేర్కొన్నారు. గతవారం సర్వ శిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు అందలేక ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే జీతాలు చెల్లించాలని కోరిన వెంటనే జీతాలు చెల్లించారని తెలిపారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు చేసిన వాగ్దానాలను కూడా నెరవేర్చాలని కోరారు.

జిపిఎస్ జీవో ఆపడం హర్షణీయం

జిపిఎస్ అమలు చేస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను నిలుపుదల చెయ్యడం పట్ల సిఎం చంద్రబాబు నాయుడుకు మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ధన్యవాదాలు తెలిపారు. సిపిఎస్ మాదిరిగానే ఉన్న జిపిఎస్ కూడా ఎంత మాత్రం ఆమోద యోగ్యం కాదని పేర్కొన్నారు. ఒపిఎస్ అమలుకు ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మాధవమ్మా ఇటు వైపు చూడవమ్మా..

● ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూపులు ● పట్టాలిచ్చినా స్థలం చూపించలేదని లబ్ధిదారుల ఆవేదన ● కొత్త ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని వేడుకోలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో నెల్లిమర్లలో ఉన్న పేదలందరినీ అధికారులు గుర్తించారు. వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారు. పెద్ద ఎత్తున ప్రచారం చేసి కొంతమందికి పట్టాలు కూడా ఇచ్చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా పట్టాలిచ్చిన వారికి స్థలాలు చూపించలేకపోయారు. కొంత మందికి మాత్రం పట్టణానికి దూరంగా కొండల్లో స్థలం చూపించారు. వారు అక్కడికి వెళ్లేందుకు వెనుకడుగు వేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే బడ్డుకొండ చొరవ తీసుకుని నెల్లిమర్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో పట్టాలిచ్చిన స్థలాలను అప్పగిస్తామని చెప్పారు. కానీ ఐదేళ్ల కాలంలో ఆ పని పూర్తి చేయలేదు. సుమారు 1500 మంది పేదలు కాళ్లరిగిపోయేలా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ, వైసిపి నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో వచ్చిన ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందింది. ఇప్పుడు నూతనంగా వచ్చిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఈ సమస్యపై దృష్టి పెట్టి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం మారిన తరువాతైనా నగర పంచాయతీలో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కుతాయా లేదోనన్న ఆందోళనతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసిపి హయాంలో నగర పంచాయతీలో 1500 పేదలను



ఇళ్ల స్థలాల కోసం లబ్ధిదారులు కోరుతున్న స్థలం ఇదే

మందిని గుర్తించి వారికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. అయితే కొండ ప్రాంతంలో ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయించడం తో అక్కడ ఎటువంటి సౌకర్యాలూ లేకపోవడంతో ఆ స్థలాన్ని పట్టాలు పొందిన లబ్దిదార్లు తిరస్కరించారు. వీరు కాకుండా మరో 62 మంది లబ్దిదార్లకు మండల పరిషత్ కార్యాలయం వద్ద పంప్ హౌస్ వెనుక ఇళ్ళ నిర్మాణం చేశారు. మిగతా 1438 మందికి మాత్రం రిజిస్ట్రేషన్ పత్రాలు తప్ప స్థలం దక్కలేదు. కాగా పలు మార్లు అధికార్లు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్ళి గత 5 సంవత్సరాలుగా మొరపెట్టుకున్నా ఫలితం దక్కలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో టిడిపి అధికారం చేపట్టిన నేపథ్యంలో ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సర్వే నెంబరు 316లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నెల్లిమర్లను ఆనుకుని ఉన్న పూడమ్మ వనం వద్ద సర్వే నెంబర్ 316లో (ఎలినేషన్ ల్యాండ్) ప్రభుత్వ మిగులు భూమి 45 ఎకరాలు ఉంది. ఈ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. గత సంవత్సరం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ కూడా ఇదే స్థలంలో కొంత భూమిని సదరు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చిన వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఎన్నికల తరువాత ఆయన ఓటమి చెందడంతో కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి అయినా తమ చిరకాల వాంఛను నెరవేర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్ల స్థలాలను పేదలకు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కెఎల్‌పురంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- విజయనగరం



శేషగిరిరావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

నగరానికి చెందిన స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ బి.శేషగిరిరావు పుట్టినరోజు సందర్భంగా శ్రీ రామలింగరాజు ఇన్‌ఫ్రా కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం కెఎల్‌పురంలోని తమ కార్యాలయంలో రక్తదానం చేశారు. విజయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 16 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బంది శేషగిరిరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విజయ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

గృహ నిర్మాణాలను పరిశీలించిన ఎంపిడిఒ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఎంపిడిఒ చంద్రశేఖర మంగళవారం పరిశీలించారు. హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. లబ్ధిదారుల సమస్యలను కూడా ఆమె అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఎఇ రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి

భోగాపురం : జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఎమ్మెల్యే లోకం మాధవి ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి ఆమె తీసుకువెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆయనను కోరారు.

గురుకులంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు చేసిన థింసా నృత్యం ఆకట్టుకుంది.



వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషారాణి

ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యు.ఉషారాణి మాట్లాడుతూ ఏటా కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులను ఉత్తేజ పరచడానికి ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం



సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగా ర్రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. సిఎంఒ ఆఫీస్‌లో చంద్రబాబుని, సచివాలయంలో లోకేష్‌ను మంగళ వారం కలిసి పలు విషయాలపై మాట్లా డారు. అనంతరం మంత్రి కింజరాపు అచ్చం నాయుడుని కూడా ఆయన కలిశారు.

నేరాలు ఘోరాలు

కొడుకు మీద బెంగతో తల్లి ఆత్మహత్యాయత్నం

నెల్లిమర్ల: కొడుకు మీద బెంగతో తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు భర్త అందించిన వివరాల ప్రకారం.. బొండపల్లి మండలం కిండాం అగ్రహారానికి చెందిన మాయల రాము, రామయ్యమ్మల కొడుకు ఇటీవల మృతి చెందాడు. కొడుకు మృతి చెందడంతో బెంగ పెట్టుకున్న రామయ్యమ్మ రామతీర్థం కొండ సమీపంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. గతంలో తన కుమారుడు రామతీర్థం కొండ మీద నుంచి పడిపోయి చనిపోయాడని, కొడుకు మృతిని తల్లి రామయ్యమ్మ ఇప్పటికీ జీర్ణించుకోలేక అదే ప్రదేశంలో ఆత్మహత్యకు పాల్పడింది. కాగా తాను తన భార్య విశాఖపట్నంలో కూలి పనుల చేసుకుంటున్నామని భర్త రాము తెలిపారు. ఇంతలో తన భార్య పురుగులు మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిందని ఆయన వివరించారు. పురు గులు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం అక్కడ చికిత్స పొందు తుంది. భర్త పోలీసులకు సమాచారమివ్వడంతో కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో విద్యుత్ షాక్‌తో టైల్స్ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుఇంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మనాభం మండలం గెద్దపేట గ్రామానికి చెందిన కల్లేపల్లి అప్పలరాజు (29) టైల్స్ పనిచేయడానికి మండలంలోని పెదతాడివాడ వచ్చాడు. ఇంట్లో టైల్స్ పనిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే ఇంటి యజమాని స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతునికి భార్యతో పాటు పది సంవత్సరాల లోపు బాబు, పాప, తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి చనిపోవడంతో భార్యతో పాటు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. తమ పిల్లలకు దిక్కెవరని భార్య పిల్లలను పట్టుకుని ఏడుస్తున్న తీరు చూపరులను సైతం కంటనీరు పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనంపై కేసు నమోదు

భోగాపురం : మండలంలోని సవరవల్లి అంగన్వాడి కేంద్రంలో దొంగతనం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి అంగన్వాడి కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి గ్యాస్ సిలిండర్‌తో పాటు గుడ్లను దొంగిలించుకుపోయినట్లు అంగన్వాడి టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: వేగావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఇబి పోలీసులు సీజ్ చేశారు. ప్రజాశక్తిలో మంగళవారం ఇసుక అక్రమ రవాణాపై ఉచితం ఉత్తిదే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు ఎస్ఇబి సిఐ మురళీధర్ అప్పగించి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ దొంగల అరెస్టు

బాడంగి : మండల పరిధిలో గల పలు గ్రామాల్లో గత కొన్ని నెలలుగా జరిగిన దొంగతనాల కేసుల్లో పాత నేరస్తులైన ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఐ ఆర్. జయంతి మంగళవారం తెలిపారు. పార్వతీపురం మండలంలోని పిన్నింటి రాముడువలసకు చెందిన మరిపి గోవింద, అదేమండలం గ్రీన్ ఫిల్డ్ కొలనీకి చెందిన ఆరిక నరేష్‌లను స్థానిక ఆకులకట్ట జంక్షన్ వద్ద పట్టుకున్నామని చెప్పారు. వారి నుంచి 4 గ్లామర్, ఒక ఎనఫిల్డ్ వాహనాలను, 90 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఎమ్‌పికి పలువురు వినతులు

ప్రజాశక్తి-బొబ్బిలి


నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ఎమ్మెల్యే బేబినాయన వివరించారు. బొబ్బిలి రైల్వే స్టేషన్లో వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని, సువర్ణముఖి నది నుంచి బొబ్బిలి పట్టణానికి ప్రత్యేక పైపులైన్ పనులకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. డొంకినవలస రైల్వే స్టేషన్ సమీపంలో చెరువులకు నీరు వెళ్లకుండా రైల్వే మూడో లైన్ కాంట్రాక్టర్ మట్టి వేశారని, చెరువులకు నీరు వెళ్లేలా చూడాలని కోరారు. ఎంపీగా ఎన్నికైన మొదటిసారి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బొబ్బిలి రావడంతో ఎమ్మెల్యే బేబినాయన, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పాల్గొన్నారు.

మాజీ సైనికులకు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వాలి

మాజీ సైనికులకు భూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడును మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్, కోశాధికారి విఎన్ శర్మ కోరారు. కోటలో ఎమ్‌పిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మాజీ సైనికులకు రిజర్వేషన్ కల్పించాలని, విజయనగరంలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పార్లమెంటులో సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్‌పి హామీ ఇచ్చారు.

లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో ఉన్న వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్



ఎమ్‌పిని సత్కరిస్తున్న మాజీ సైనికులు, ఎమ్మెల్యే బేబినాయన

కేంద్రాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడును పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ, కళాసీలు కోరారు. కోటలోకి వచ్చిన ఎంపికు ఎమ్మెల్యే బేబినాయనతో కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే మూడో లైన్ పనులు కారణంగా వ్యాగన్ కేంద్రాన్ని బొబ్బిలి నుంచి వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రం వేరే ప్రాంతానికి తరలిస్తే 500 మంది హమాలీలు, 250మంది మోటారు కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలిలోనే వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని కోరారు. పార్లమెంటులో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపి హామీ ఇచ్చారు.

డీలర్లపై చర్యలకు పాల్పడడం సరికాదు

ప్రజాశక్తి- చీపురుపల్లి



తహశీల్దార్‌ను నిలదీస్తున్న వైసిపి నాయకులు

ఎటువంటి కారణం లేకుండా రేషన్ డీలర్లపై చర్యలకు పాల్పడడం మంచిది కాదని వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు అధికారులపై మండి పడ్డారు. సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహశీల్దారు పిన్నింటి రామారావు అన్యాయంగా డీలర్ల పట్ల వ్యవహరిస్తున్నారని తహశీల్దారుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎండిఎం పాయింట్ నుంచి డీలర్లకు రేషన్ బియ్యం నేరుగా డిపోలకే అధికారులు పంపించారని, ఎండిఎం పాయింట్‌లో బయో మెట్రిక్ మిషన్ పని చేయకపోవడంతో అధికారులే తరువాత బయో మెట్రిక్ వేయొచ్చని చెప్పి మరీ డీలర్లకు రేషన్ బియ్యాన్ని పంపించారని అలాంటప్పుడు ఏ విధంగా డీలర్ల వద్దకు సియస్‌డిటి వెళ్లి ఆకస్మిక తనిఖీలని చెప్పి డీలర్లపై చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. సిఎస్‌డిటి వచ్చి తమకు సమాధానం చెప్పే వరకు తాము తహశీల్దారు కార్యాలయం నుంచి కదిలేదు లేదని మండలంలో గల గొల్లల ములగాం, పత్తికాయవస, విశ్వనాధపురం డీలర్లతో కలసి వైసిపి నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. సియస్‌డిటి కార్యాలయానికి రాకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో తహశీల్దారు విఆర్‌ఎని సియస్‌డిటి ఇంటికి పంపించి కార్యాలయానికి తక్షణమే రావాలని చెప్పమన్నారు. అయినప్పటికీ సియస్‌డిటి ఇంటి దగ్గర కూడా లేకపోవడంతో తాను విషయాన్ని తెలుసుకొని పరిష్కరిస్తానని తహశీల్దారు నందిగాం ప్రసాద్ వైసిపి నాయకులకు హామీ ఇచ్చారు. తహశీల్దారుని కలసిన వారిలో రామలింగాపురం సొసైటీ మాజీ అద్యక్షుడు రేవల్ల సత్యన్నారాయణ, అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాధరావు, మెట్టపల్లి ఎంపిటిసి మీసాల ఈశ్వరరావు తదితరులున్నారు.

సాగుదారుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి రైతు సంఘం నాయకులు బి.రాంబాబు

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లాలో వేలాదిగా ఉన్న దేవాదాయ ధర్మాదాయ భూ సాగు దారులు, కౌలు దారులు, 90 శాతం చిన్న సన్న కారు, సొంత భూమిలేని రైతులు, కౌలకు చేస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు బి.రాంబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని తుమ్మికాపల్లి, కొత్త సుంకరపాలెం, పాత సుంకరపాలెం, కొత్తూరు, సింహాద్రిపాలెం, చిన్నిపాలెం, ఉత్తరాపల్లి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం ప్రజా సంఘాల కార్యాలయంలో సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు కౌలు రైతులందరూ హాజరుకావాలని కోరారు. గతంలో సాగులో ఉండి ఎండోమెంట్ అధికారులు కౌలు మూడు సంవత్సరాలకు ఒకసారి ధర పెంచి అదే రైతును కొనసాగించేవారని, ఈ మధ్యకాలంలో బహిరంగ వేలం



రైతులతో మాట్లాడుతున్న బుద్దరాజు రాంబాబు

పాట పెట్టి ఎవరు ఎక్కువ ధరకు పాడితే వారికే కౌలుకి ఇస్తామంటున్నారని చెప్పారు. ఈ విధానం వల్ల అనేకమంది పేద సాగుదారులు వేలంలో పోటీపడలేక భూమి నుంచి గెంటివేయబడుతున్నారన్నారు. ఇప్పటికే ఈ విధానం వల్ల రైతులు, పేద రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది వారసత్వంగా వచ్చిన భూములు కూడా దేవాలయ భూముల కింద నమోదు చేసి వారి భూ హక్కులను వివాదాల పెట్టి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యకతం చేశారు. గతంలో సుప్రీంకోర్టు చిన్న సన్న కారు సాగుదారులకు బహిరంగ వేలం వేయకుండా 13శాతం కౌలు పెంచి విధంగా ఉండేదని గుర్తు చేశారు. మిన హాయింపులు పక్కనపెట్టి ప్రభుత్వాలు ఎండోమెంట్ అధికారుల ద్వారా బహిరంగ వేలానికి పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ఎదుర్కోవడానికి జిల్లాలో దేవాదాయ ధర్మాదాయ పూర్వీకుల నుండి భూసాగుధారులు, కౌలుదారులు ఐక్యమై సమస్యలు చర్చించి పరిష్కరిష్కరించుకొని దానికి కార్యాచరణ కోసం జరిగే సదస్సులో పాల్గోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడి అప్పారావు, సేనాపతి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధం ఎత్తివేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ ఉద్యోగులు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేసి బదిలీలు చేయాలని మున్సిపల్ బిల్లు కలెక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి జిఎంఖాన్ ఒక ప్రకటనలో కోరారు. జీరో సర్వీస్ బదిలీలు చేయాలని, ఉద్యోగుల బదిలీల్లో 20 శాతం నిబంధనలు తొలగించి బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి వారాలు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎరుకలపాకలు గ్రామంలో శ్రీ ఎల్లమ్మ తల్లి వారాలను ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి వారాలను ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి ఆయన ఆనందంలో ఉత్సాహంగా తమ 120 కుటుంబాలు పెద్ద ఎత్తున ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్నామని గౌరు తెలిపారు.

లోకేష్‌ను కలిసిన సువ్వాడ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి విజయనగరం పార్లమెంటరీ మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వనజాక్షికి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

15 నుంచి ఉచిత బస్సు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15 నుంచి అమలలోకి వస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని చీపురువలస గ్రామంలో, గ్రామ టిడిపి నాయకులు అనిమిరెడ్డి రమణ, బంగారు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, ఎస్‌కోట వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి పాల్గొన్నారు. వీరికి చీపురువలస గ్రామ టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ రాష్ట్రాన్ని, భావితరాల యువత భవిష్యత్తుని కాపాడుకోవాలని ప్రతి ఒక్క ఓటర్ కంకణం కట్టుకొని నాయకులందరు కూటమి విజయానికి భాగస్వాములై ఎన్‌డిఎ కూటమిని గెలిపించారన్నారు. మీ ఆడబిడ్డలాంటి తనపై నమ్మకం ఉంచి 40వేల మెజారిటీతో గెలిపించినందుకు అందరకి తాను రుణపడి ఉంటానని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల హామీలో భాగంగా సూపర్ 6 పథకాలను ఒక్కొక్కటీగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అందులో భాగంగా జులై నెల నుంచి పెంచిన పింఛన్లు, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు, అన్న క్యాంటీన్ లను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస, చీపురువలస టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని గంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య అధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం గంట్యాడ బీసీ హాస్టల్ విద్యార్థులకు ఉచిత వైద్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు భోజనాలు పెట్టాలని, నిల్వ పదార్థాలను ఉంచకూడదని, వేడి నీటిని అందించాలని వార్డెన్ శర్మకు సూచించారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ పాటించినప్పుడే అభివృద్ధి చెందుతారని చెప్పారు. అనంతరం విద్యార్థులందరికీ వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఎర్రన్న పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చట్టాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి సూచించారు. మంగళవారం సీతారామునిపేట గ్రామ సచివాలయంలో జరిగిన న్యాయ అవగాహనా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకొని జీవనం సాగించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించిన సేవలలో ఉచిత న్యాయవాది, సివిల్, క్రిమినల్ కేసులలో పార్టీల తరపున అవసరమైన న్యాయ వాదిని ఎస్‌సి, ఎస్‌టి, ఆర్థికంగా వెనుకబడిన ఇతరులకు ఉచిత న్యాయ వాదిని అందిస్తామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను స్నేహ పూర్వక వాతావరణంలో ఇరు పార్టీల సమక్షంలో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు రహదారు దారులలో ప్రయాణించే టు వీలర్ డ్రైవర్, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి. దుర్గయ్య మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ద్వారా



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విజయకల్యాణి

కేసుల పరిస్కారమవుతాయన్నారు. ప్రజోపయోగ సేవలైన, ఎలక్ట్రిసిటీ, బ్యాంకింగ్, రైల్వే, రోడ్, వాయు రవాణాలలో వినియోగదారులకు జరిగిన నష్ట పరిహారాన్ని కోటి రూపాయల వరకు ప్లాపస్ ద్వారా పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ధర్మ రాజు, ఎంపిడిఒ జి.రామారావు, ఎఎస్ఐ కెవి రమణమూర్తి, గ్రామ సర్పంచ్, ఇతర గ్రామ పెద్దలు, సచివాలయ కార్యదర్శి, సచివాలయ, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం ప్రకటన పట్ల హర్షం

బొబ్బిలి: సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన జిపిఎస్ అమలు నోటిఫికేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుదలకు ఆదేశాలు ఇవ్వటాన్ని ఎపిటిఎఫ్ హర్షిస్తుందని ఎపిటిఎఫ్ అకడమిక్ కన్వీనర్ జెసి రాజు తెలిపారు. ఎన్‌జిఒ హోమ్‌లో మంగళవారం ఫెడరేషన్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసనలు, ఆందోళనలు చేసిన నేపథ్యంలో పత్రికల ద్వారా విషయాన్ని తెలుసుకున్న సిఎం తక్షణమే స్పందించి ఉత్తర్వులను నిలిపివేయమని చెప్పటం ఉద్యోగ, పాధ్యాయుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం, నమ్మకం పెరిగిందన్నారు. సిపిఎస్, జిపిఎస్ రద్దుకు సానుకూలంగా స్పందించాలని పాత పింఛను విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని కోరారు. 2003 డిఎస్‌సి వారికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పాత పింఛను విధానాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ ప్రతినిధులు జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, సింహాచలం, రామకృష్ణ, ఎల్లయ్య, లక్ష్మణ తదితరలు పాల్గొన్నారు.

ప్రతి రూపాయీ ప్రజలకు చెందాలన్నదే లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

రాష్ట్రంలో వస్తున్న ప్రతీ రూపాయి ప్రజలకే చెందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. తన నివాశంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నెల రోజులైందని, సిఎం చంద్రభాబు ప్రజలకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. పారదర్శకతతో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ఎక్కడికక్కడ గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేస్తున్నారని గుర్తు చేశారు. దీని కారణంగా ప్రజల ధనం ఏవిధంగా ఖర్చు అవుతుంది, ఏవిధంగా వినియోగ పడుతుందనేది తెలుస్తుందని చెప్పారు. గత ఐదేళ్లలో మన రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి చేశారని, అధికారంలోనికి వచ్చిన నెలలోనే రాష్ట్రానికి రాజధాని రాబోతుందని చంద్రబాబు తెలిపారని చెపారు. ఆయన పాలన చూసి ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామని చర్చించుకుంటున్నట్లు నాగార్జున తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ఈ నెల 18 నుంచి ఆగస్టు రెండు వరకు కుష్ఠు వ్యాధి గ్రస్థులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందని స్థానిక పిహెచసి వైద్యాధికారులు రాజేష్ వర్మ, ప్రమీల దేవి అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో కుష్టివ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సిలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం పైన ఆశా కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు, ఏఎన్‌ఎంలకు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రమీల దేవి మాట్లాడుతూ తమ పిహెచ్‌సి పరిధిలోని సుమారు 9,500 కుటుంబాలలో ఈ కార్యక్రమం పటిష్ఠంగా చేపట్టాల చెప్పారు. ప్రతి అనుమానిత కేస్ మెడికల్ ఆఫీసర్‌కి చేరేలా చూసుకోవాలని సూచించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, రిపోర్టింగ్ విధానాన్ని వివరించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిహెచ్ఒ వేదమని, హెల్త్ ఎడ్యుకేటర్ వి. మహేశ్వరి, సూపర్‌వైజర్ ఆర్. నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్‌వి రమణ, ఏఎన్‌ఎం, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేటలో పిహెచ్‌సి పరిధిలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకూ కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టాలని వైద్యాధికారి గోపాలకృష్ణ సిబ్బందికి సూచించారు. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధికి ఎమ్‌డిటి అనే మందు ఉచితంగా అన్నీ ప్రభుత్వ ఆసుపత్రి లలో దొరుకుతుందన్నారు. రోగులకు కాళ్ళు తిమ్మిర్లు, కాళ్ళ చెప్పులు జారిపోవడం, వేడి వస్తువులు, పట్టుకున్న స్పర్శ తెలియక పోవడం, కాళ్ళకి ముళ్ళు, రాళ్ల తగిలిన స్పర్శ తెలియక పోవడం, కనురెప్పలు మూసుకోకపోవడం, చెవి తమ్మెలు పై బోడిపేలు వంటి లక్షణాలు ఉంటే కుష్టుగా గుర్తించాలన్నారు. ఎల్‌సిడిసి సర్వే రోజుకి ఒక్కొక్క టీమ్ 20 ఇండ్లు సర్వే చేసి వ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్.ఎస్ ఈశ్వరరావు, హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.